క్లుప్తంగా

దుండగులను అరెస్ట్ చేయాలి

దేవరపల్లి: నెల్లూరు నియోజకవర్గంలో అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోలు పోసి తగలబెట్టిన సతీష్ నాయుడు, అతని అనుచరులను తక్షణం అరెస్ట్ చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు సాలి వేణు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం హేయమైన చర్యగా ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా పరిపాలన సాగిస్తుందని విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాఠశాలకు గేటు ఏర్పాటు

నిడదవోలు రూరల్: శెట్టిపేటలోని నంబర్-3 ఎంపీపీ పాఠశాలకు బయ్యే విజయకుమారి, సౌజన్య క్రాంతిప్రియ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నంగన్న, లక్ష్మీకాంతం ఇనుప గేట్‌ను ఏర్పాటు చేశారు. దీనిని నాయకుడు బయ్యే వెంకట్రావు శుక్రవారం ప్రారంభించారు. ఎంఈఓలు కేవీ గణేష్, పి.గురుమూర్తి, సర్పంచ్ జడ్డు శ్రీలక్ష్మి, హెచ్‌ఎం శిరీషా పాల్గొన్నారు.

కార్యదర్శి ఉద్యోగం కత్తిమీద సామే

దేవరపల్లి: మండలంలోని బంధపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ గత నెల 30న పదవీ విరమణ పొందిన షేక్ మొహిద్దీన్ షరీఫ్‌కు అభినందన సభ శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్ నాగార్జునరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ దుర్గారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం కత్తిమీద సాము లాంటిదని, ప్రభుత్వ ఆదేశాలను అమలు జరపాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉంటుందన్నారు. అనంతరం షరీఫ్ దంపతులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మేలు

తాళ్లపూడి (కొవ్వూరు): వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు జరుగుతుందని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. కొవ్వూరులో శుక్రవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లబ్ధిపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు పాల్గొన్నారు. కాగా తాళ్లపూడిలో పలు వ్యాపార సంస్థల యజమానులు, సిబ్బందితో కలిసి మెయిన్‌రోడ్డులో సేల్స్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రాగి తీగల చోరీ



దుండగులు పగలగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్ ఇదే..

నల్లజర్ల: మండలంలోని ముసుళ్లగుంటయ శివారు పొలాల్లో మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి అందులో ఉన్న రాగి తీగలను చోరీ చేశారు. శుక్రవారం ఉదయం పొలాల్లోకి వెళ్లిన రైతులకు ఈ దృశ్యాలు కనిపించాయి. ఈ విషయాన్ని రైతులు పాకలపాటి వెంకటేశ్వరరావు, పాలగాని రాంబాబులు సర్పంచ్ నందమూరి శారదాదేవి ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హారతిలో సాయిబాబా ఆకారం ప్రత్యక్షం



నల్లజర్ల: మండల కేంద్రం స్థానిక సాయిబాబా గుడిలో గురువారం విజయదశమి రోజు సాయంత్రం హారతిలో బాబా ఆకారం ప్రత్యక్షమైంది. ఓ భక్తుడు దీనిని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. అప్పటికే గుడి నిండా భక్తులు ఉన్నారు. ఈ విషయం తెలియగానే ఆ దృశ్యాన్ని చూడటానికి భక్తులు క్యూ కట్టారు. ఆలయ అర్చకుడు అన్నపూర్ణారావు మాట్లాడుతూ బాబా మన హృదయంలోనే ఉన్నాడనే భావనతో పూజ చేసినట్టయితే మంచి జరుగుతుందన్నారు. భక్తితో బాబాను సేవించగలిగితే ఇటువంటి అద్భుతాలు కన్పిస్తాయన్నారు.

స్వచ్ఛ ఎన్జీఓ అవార్డుకు స్వర్ణాంధ్ర ఎంపిక

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం కేంద్రంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర సేవా సంస్థను కలెక్టర్ స్వచ్ఛ ఎన్జీవో అవార్డుకు ఎంపిక చేశారు. ఈ విషయాన్ని ఆ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు. అక్టోబర్ 6వ తేదీన ఈ అవార్డును అందజేస్తారన్నారు. అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. కాగా.. రాంబాబుకు స్వర్ణాంధ్ర గౌరవ సలహాదారు సినీ హీరో సుమన్, అధ్యక్షుడు రుంకాని వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సీపీ రెడ్డి, వ్యవస్థాపకుడు పడాల రామిరెడ్డి, పలువురు నగర ప్రముఖులు అభినందనలు తెలిపారు.

సూపర్ సిక్స్ కాదు.. సూపర్ ఫట్



తిరుగుడుమెట్టలో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు



కృష్ణంపాలెంలో కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రబాబు

తాళ్లపూడి: ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా, ప్రజలను మోసగిస్తుందని నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని తిరుగుడుమెట్టలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ మోసం-గ్యారంటీ' కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు వల్లభశెట్టి చిన్ని ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మండల నాయకులతో కలిసి గ్రామంలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' ద్వారా రచ్చబండ నిర్వహించి కూటమి మోసాలను ప్రజలకు వివరించారు. సమావేశంలో తలారి మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు పథకాలను నేరుగా అమలు చేశారన్నారు. 2024 ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీలపై టీడీపీ, కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి బాండ్లు ఇచ్చారని, ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసి కూటమి ప్రభుత్వం సంబరాలు చేసుకోవడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ కవల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అందుగుల పాప, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ నాయకుడు వల్లభశెట్టి చిన్ని, తోట రామకృష్ణ, తిగిరిపల్లి వెంకట్రావు, అందుగుల రవి, కోనాల వీర్రాజు, శాలి రాజు, బొంతా సాయి, బట్టు సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమికి ఓటమి తప్పదు

దేవరపల్లి: కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి ఓటమి తప్పదని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు అన్నారు. దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన జరిగిన బాబూ ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు కూటమి ప్రభుత్వ మోసాలకు ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువునా మోసం చేసిందని ఆయన ఆరోపించారు. రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు లేక దళారుల దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటను కనీసం మద్దతు ధరకు అమ్ముకోలేక రైతులు నష్టపోతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్నదాతను మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా ఆదుకున్నారని, సీజన్ ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందించడంతో పాటు పంటలు దెబ్బతిన్న రైతులకు సకాలంలో నష్ట పరిహారం అందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సత్తి సాయి ఈశ్వరరెడ్డి, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడిబోయిన గంగరాజు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు సత్తి జగదీశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, మండల మహిళా అధ్యక్షురాలు కడలి హైమావతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు టి.కాశీరెడ్డి, బళ్ల సత్యనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూతపడిన సొసైటీ పెట్రోలు బంకు పరిశీలన



పెట్రోలు బంకును పరిశీలిస్తున్న జేసీ మేఘస్వరూప్

తాళ్లపూడి: అన్నదేవరపేట సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పెట్రోలు బంకును జిల్లా జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్ శుక్రవారం తనిఖీ చేశారు. కన్స్యూమర్ లైసెన్స్‌పై నడుస్తున్న ఈ బంకు సుమారు ఏడాది కాలంగా నిలిచిపోయింది. దీనిని రిటైల్ లైసెన్స్‌గా మార్చి సొసైటీకి, ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని అధ్యక్షుడు గోరిజాల వెంకట ప్రసాద్ (జీవీ) చర్యలు చేపట్టారు. డీజిల్, పెట్రోలు చెరో 20 వేల లీటర్ల మేర విక్రయించేందుకు అనుమతులు కోరారు. ఇందులో భాగంగా జేసీ మేఘస్వరూప్ ఈ బంకును పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ లావణ్య, సొసైటీ కార్యదర్శి పి.శ్రీనివాస్, వీఆర్‌ఓ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్ముని సేవలు చిరస్మరణీయం



గోపాలపురంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వనిత

నిడదవోలు రూరల్: సత్యం, అహింస ఆయుధాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ స్ఫూర్తిదాయకమని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు పూలమాలలు వేశారు. ఎంపీడీఓ వీఎస్‌వీఎల్ జగన్నాథరావు, నాయకులు పోలిరెడ్డి వెంకటరత్నం, తిరుమళ్ల దుర్గారావు, అధికారులు పాల్గొన్నారు. అలాగే పలు సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించి గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

గాంధీ మార్గం స్ఫూర్తిదాయకం

గోపాలపురం: జాతిపిత మహాత్మా గాంధీ సేవలు చిరస్మరణీయమని మాజీ హోంమంత్రి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తానేటి వనిత అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం గోపాలపురంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎంతో మంది త్యాగధనులు పోరాట ఫలితమే నేటి స్వాతంత్రం అని అందులో మహాత్మా గాంధీ పాత్ర కీలకమన్నారు. అనంతరం షిర్డీ సాయి బాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెలగా శ్రీరామమూర్తి, కూసం రామమోహన్‌రెడ్డి, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, వింత ప్రసాద్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు

గాంధీజీకి ఘన నివాళి

నిడదవోలు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గాంధీ జయంతిని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. రంగోళి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, వైస్ చైర్మన్ షేక్ వజీరుద్దీన్, కౌన్సిలర్లు పువ్వల రతీదేవి, ఉసురుమర్తి జాన్‌బాబు, గుర్రం శాంతిశ్రీ, చిలకల శారదాదేవి, కారింకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలకు ఉపాధ్యాయులు ప్రాధాన్యం ఇవ్వాలి



అనంతపల్లిలో ఇండోర్ షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మూర్తి

నల్లజర్ల: విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ, ఉద్యోగులు క్రీడలకు ప్రాధాన్యతనిచ్చి ఆరోగ్యం పరిరక్షించుకోవాలని టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి సూచించారు. అనంతపల్లిలో క్రీడా అభిమాని జల్లిపల్లి లక్ష్మీజగన్నాథరావు రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన ఇండోర్ షటిల్ కోర్టును గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడుతూ ఆర్థిక అంశాలపై చేపట్టిన ఉద్యమాన్ని విజయవంతం చేసామన్నారు. ఈ నెల7వ తేదీ ఫ్యాప్టో తరపున చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పీఆర్సీ చైర్మన్ ఏర్పాటు చేసిన 12వ పీఆర్సీని అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

బాణసంచా షాపుల తనిఖీ



చాగల్లులో బాణసంచా షాపును తనిఖీ చేస్తున్న డీఎస్పీ దేవకుమార్

చాగల్లు: వచ్చే దీపావళి పండగ సందర్భంగా మండలంలో ఉన్న బాణసంచా షాపులను శుక్రవారం కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. షాపుల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకున్న జాగ్రత్తలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వ్యాపారులు లైసెన్స్‌లు రెన్యువల్ అయ్యాక మాత్రమే బాణసంచా తయారు చేయాలన్నారు. ప్రతి షాపులో సీసీ కెమెరాలు, వాటర్ సప్లై ఉండాలన్నారు. అనధికార అమ్మకాలు, ఇళ్లలో నిల్వ చేయడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నిబంధనల మేరకు బాణసంచా తయారీ ఉండాలని, పని చేసే వారికి బీమా చేయించాలన్నారు. మైనర్లను పనుల్లో పెట్టుకోరాదని తెలిపారు. ఆయన వెంట చాగల్లు ఎస్సై కె.నరేంద్ర ఉన్నారు.

నిల్వ చేస్తే చర్యలు

దేవరపల్లి: అనుమతి లేకుండా ఇళ్లు, దుకాణాలు, గొడౌన్లలో టపాసులు, బాణసంచా నిల్వ చేసినా, విక్రయాలు జరిపినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని దేవరపల్లి సీఐ బీఎస్ నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. దుకాణదారులు, విక్రయదారులు, తయారీదారులు తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని ఆయన సూచించారు. అనధికారికంగా దీపావళి టపాసుల తయారీ, విక్రయాలు, నిల్వ ఉంచిన వ్యక్తుల వివరాలు తెలిపిన వారికి రూ.5 వేలు బహుమతి ఇస్తామని ప్రకటించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు. సమాచారాన్ని 94407 96584 (సీఐ), 94407 96624 (ఎస్సై దేవరపల్లి) 94407 96665 (ఎస్సై గోపాలపురం) నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

భూ కబ్జాకు టీడీపీ నేతల యత్నం

- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు
- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కన్వీనర్ గోగులమండ బాజ్జి



న్యాయవాది బాజ్జి స్థలంలో టీడీపీ నేతలు కట్టిన బ్యానర్

నల్లజర్ల: రెండేళ్ల కిందట మండలంలోని ప్రకాశరావుపాలెం హైస్కూల్ సమీపంలో తన భార్య కమలకుమారి పేరిట 5 సెంట్ల స్థలం కొనుగోలు చేస్తే, కూటమి ప్రభుత్వం వచ్చాక దానిని టీడీపీ నేతలు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండల వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది గోగులమండ బాజ్జి ఆరోపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. గత నెల 19వ తేదీ అర్ధరాత్రి తమ స్థలంలో తప్పుడు ఫోన్ నంబర్లతో స్థలం తమ ఆధీనంలో ఉందంటూ ఫ్లెక్సీ పెట్టారన్నారు. దానిపై ఉన్న ఫోన్ నంబరుకు ఫోన్ చేస్తే అది తప్పుగా ఉందని, గత నెల 20న పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ విషయమై పలుమార్లు పోలీసులను సంప్రదించగా కనీసం బోర్డు పెట్టిన వారిని పిలిపించి వారి వద్ద ఉన్న హక్కుపత్రాలు కూడా పరిశీలించకుండా వత్తాసు పలుకుతున్నారన్నారు. 26వ తేదీన జిల్లా ఎస్పీ, డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లినా, ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. పోలీసు శాఖలో ఉన్నతాధికారులంతా అధికార పార్టీకి తలొగ్గి, ఒక దళితుడికి న్యాయం చేయలేకపోతున్నారని, ఈ విషయం కోర్టులో తేల్చుకోవాలంటూ ఉచిత సలహా ఇస్తున్నారని బాజ్జి ఆవేదన వ్యక్తం చేశారు.

ఆసుపత్రిలో అన్నసమారాధన



రోగులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న మానవత సభ్యులు

నిడదవోలు: మానవత సంస్థ ఆధ్వర్యంలో గురువారం మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రిల జయంతిని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు భోజన పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవీ రమణ, పొన్నా సుబ్రహ్మణ్యం, నారాయణి, దారపురెడ్డి సూర్యచంద్రరావు, తన్నీడి బోసు, ఎన్‌వీ చౌదరి, పాడుగు నరేష్, ఎస్‌వీ రమణ, నీలం రామారావు, షేక్ హైదర్ బాషా, గెడా రామచంద్రరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల ప్రయోజనాలకే పని గంటల పెంపు



నిడదవోలులో ధర్నా చేస్తున్న కార్మికులు

నిడదవోలు: పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే కూటమి ప్రభుత్వం కార్మికుల పని గంటలను పెంచుతూ నిర్ణయం తీసుకుందని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ విమర్శించారు. పని గంట పెంపును నిరసిస్తూ అభ్యుదయ పెయింటర్స్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరానగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రవ్వ సురేష్‌కుమార్ మాట్లాడుతూ కార్మిక వర్గ పోరాటాలతో సాధించుకున్న 8 గంటల పని దినాన్ని కూటమి ప్రభుత్వం మార్చడం దారుణమన్నారు. గ్రీష్మకుమార్ మాట్లాడుతూ షాపింగ్ మాల్స్, ప్రైవేటు వ్యాపార సంస్థలు, కర్మాగారాల యజమానుల జేబులు నింపేందుకు కోట్లాది శ్రమ జీవుల బతుకులను చంద్రబాబు ప్రభుత్వం పెట్టుబడిదారుల పాదాక్రాంతం చేసిందన్నారు. గుంటు రాజీవ్, యాదాల రమణ, యల్లమిల్లి కార్తీక్, బాలు, రత్తయ్య, పాలంగి చంద్రరాజు, విశ్వాస్ రాధాకృష్ణ, యాదాల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

రూ.85 వేలు పలికిన బాలదుర్గమ్మ విగ్రహం

దేవరపల్లి: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించిన బాలదుర్గమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గురువారం రాత్రి ఆలయ కమిటీ వారు వేలం పాట నిర్వహించారు. పాటలో గ్రామానికి చెందిన గానుబోయి నాగరాజు, నాగలక్ష్మి దంపతులు పాల్గొని రూ.85 వేలకు దక్కించుకున్నారు. ఈ నెల 6వ తేదీన పాట దారులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నిడదవోలు: పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం లాంటిదని ఏపీఎస్‌ఎస్‌డీసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. ఉండ్రాజవరం మండలం వేలివెన్ను రైతు సంఘ భవనంలో నియోజకవర్గ పరిధిలో 64 మంది లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) రూ. 27.20 లక్షల నగదు చెక్కులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు.



అఖిల జగాలకు.. అమ్మవు నీవే



తాళ్లపూడిలో చిన్నారులతో నిర్వహిస్తున్న పూజ



తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ వారు



ప్రత్యేక అలంకరణలో బ్రాహ్మణగూడెం నాగారమ్మ



తిమ్మరాజుపాలెంలో భవానీ పీఠం వద్ద అమ్మవారిని దర్శించుకుంటున్న పల్లారావు

తాళ్లపూడి: శరన్నవరాత్ర మహోత్సవాలు మండలంలో ఘనంగా ముగిశాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తాళ్లపూడిలోని నవదుర్గాధి పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో ఆఖరి రోజు అమ్మవారికి రాజరాజేశ్వరీదేవి అలంకారం చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దర్శించుకున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి రథయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. కోలాటం, గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో గ్రామ వీధుల్లో రథయాత్ర కొనసాగింది. మహిళలు, చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వాహనాలకు పూజలు చేయించారు. చిన్నారులను నవదుర్గలుగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పైడిమెట్టలో అమ్మవారికి పూజలు నిర్వహించి, తాళ్లపూడి, ప్రక్కిలంక గ్రామాల మీదుగా అమ్మవారిని పూలతో అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

జగన్మాతకు జేజేలు

నిడదవోలు రూరల్: మండలంలో దసరా సంబరాలు అట్టహాసంగా ముగిశాయి. తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోట సత్తెమ్మ వారిని శరన్నవరాత్ర ముగింపు ఉత్సవాల్లో భాగంగా గురు, శుక్రవారాల్లో వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 251 మంది దంపతులు సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. చండీ పారాయణ, హోమాలు, శమీ పూజలు నిర్వహించారు. ఆలయానికి వివిధ రూపాల్లో రూ.3,00,100 ఆదాయం వచ్చినట్లు ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ చెప్పారు. తిమ్మరాజుపాలెంలో భవానీ పీఠాల వద్ద అమ్మవార్లకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు ప్రత్యేక పూజలు చేశారు.

పెరవలి: ఖండవల్లి రవళి స్పిన్నింగ్ మిల్లులో విజయ దశమి వేడుకలు నిర్వహించారు. శాసన మండలి సభ్యుడు రవీంద్రనాథ్ కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. ఫ్యాక్టరీ డైరెక్టర్ రవళి, వంక రాజకుమారి, సీఈఓ వికాస్ వీరాస్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.

పెరవలి: మండంలోని ఖండవల్లి, పెరవలి, కానూరు, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, ముక్కామల, వెంకట్రాయపురం గ్రామాల్లో కనకదుర్గమ్మ ఆలయాల వద్ద కుంకుమ పూజలు చేశారు. వెంకట్రాయపురంలో కనకదుర్గమ్మ మండపం ఆకట్టుకుంది. ఇక్కడ విజయవాడ కనకదుర్గమ్మ లానే ప్రతిమ ఉండడంతో భక్తులు పరవశితులయ్యారు.

ముగిసిన దసరా ఉత్సవాలు

చాగల్లు: అంగరంగ వైభవంగా జరిగిన దసరా ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ఊరేగింపులు జరిపారు. చాగల్లు మాతంగి చెరువు గట్టుపై ఉన్న కనకదుర్గమ్మను విజయ దశమి సందర్భంగా సుందరంగా అలంకరించారు. ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. చాగల్లులో ధనలక్ష్మి, బ్రాహ్మణగూడెం గ్రామ దేవత నాగారమ్మ, రావుల చెరువు గట్టు మీద వున్న కనకదుర్గమ్మ ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్
90102 23729 (కొవ్వూరు) 90100 51493 (నిడదవోలు)
79956 78554 90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com